గల్పిక

# భిన్న ధృవాలు

పారిజాత

"అమ్మా" అని కేకవినిపించింది — వెంటనే ప్రతిధ్వనిగా "అమ్మా" అని మారు మ్రోగింది. ఈ విధంగానే "అమ్మా" అని విని పించినప్పుడల్లా ప్రతిధ్వనిలా "అమ్మా" అని మరోకంఠం ఎలుగెత్తేది.

ప్రతియింటిముందూ "అమ్మా"అనే శబ్దంవినిపించటం పరిపాటే—ఆసేతు హిమాచలంలోనూయిటువంటి "అమ్మా" అనే శబ్దం పలికేవారు చాలా ఎక్కువే; అయినా ఆపల్కడంలోకూడా తేడావుంది.

ఆయింటిముందు ఒక బికారి ఆగి "అమ్మా" అన్నాడు; వెంటనే నాల్గేళ్ల కుర్రాడు ఆ మాటనే తిరిగి ఉచ్చరించాడు. బికారి "అమ్మా" అన్నప్పుడల్లా పిల్లవాడు ప్రతినినాదం యిస్తున్నాడు. ఆ నాల్గేళ్ల కుర్రవానికి "అమ్మా" అనేశబ్దం ఎవరు నేర్పినా అది అతని జీవితానికి ఒకమార్గమేనా? నాల్గుసంవత్సరాల వయసునుంచి నూరేళ్లూ నిండేదాకా అతనికి అదే ఉద్యోగమా? దానికి వేరే మార్గంలేదా?

అబ్బాయి గాత్రం వినిపేసిందో లేక అది ఆమెకు అలవాటో తెలియదుగాని గుప్పెడుగింజలుదొరికినై.

పెద్దవాళ్లుఅడుక్కుంటే గింజలురాలడం అరుదు అంచేతేనేమో కుర్రకుంకని వెంటబెట్టుకున్నాడు!

రెండువీధులు చుట్టివచ్చినా నాల్గుగింజలు దొరకని అభాగ్యుడు—యిదంతా కనిపెడుతూనే వున్నాడు గాబోలు అతనికికూడా—తోడుగా చంటిపిల్లవాడు దొరికితే! అయినా తనకే తింటానికి లేనపుడు వాడొకడాతోడు!—పెళ్ళిచేసుకోలేదుకనుక సరిపోయింది అయినా చేసుకోదల్చినా ఎవరూ లేరుగా వరించడానికి! పెళ్ళేలేంది పిల్లాజెల్లా ఎల్లావస్తారు?

ఇల్లా అనుకోంటూనే యిందాకటి "అమ్మ"కై వేంచేశాడు. "అమ్మా" అని పిలవడం "పైకిపో" అని జవాబియ్యటం తృటిలో జరిగిపోయినై. పైకి పోవాలిట—ఎంతదూరం? ఎటుపైకి?

చెట్టు నీడనే నిల్చున్నాడు. తూలుతూ, మూలుగుతూ చేతిలోని కర్రపూతతో మాలిగి పోతూన్నట్టుగా వస్తున్నాడు — ఎవరికోసమో? అతనూ యీ వుద్యోగమే కాబోలు! ఇంతసేపు తిరిగితే గుప్పెడు గింజలు దొరకలేదు గదా—అంతకంగారు దేనికి?

"అమ్మా" అని దీనంగా పిలిచాడు. "పైకిపో" అనే సమాధానం వస్తుందని ఆశించిన పేదవానికి ఆశాభంగం కలిగింది. జోలిలో గింజలు రాలినై చెట్టుక్రింద పేదవాడు గబగబావచ్చి "అమ్మా" అని పిలిచాడు. "పొమ్మ్రగే [illegible]" అని వినిపించేసరికి కళ్ళు చెమ్మగిల్లినై. దానధర్మాలలో కూడ పక్షపాతమేనా? లేక దానధర్మాలకు ఒకవిధమైన యోగ్యతేమైనా వుందా? కుంటిగ్రుడ్డి, పిల్లా, పాపా మొదలైన వారికేనాయీ దానాలూ, ధర్మాలూ?

నడుస్తున్నాడేగాని ఏమీ పాలుపోటంలేదు. గంజినీళ్లుత్రాగి మూడురోజులైంది. నీరసం ఎక్కువైంది. దానికి తోడుగా ప్రొద్దు నడినెత్తిమీదుంది. ఈర్ష్యతో తొట్రుబాటుతో కాళ్ళు నడక సాగిస్తున్నాయ్.

హఠాత్తుగా కారు హారన్ మ్రోగింది. త్రుళ్ళిపడి హడావిడిలో తప్పుకోబోయికారుకిందవెళ్ళిపడ్డాడు.

...జనరల్ ఆసుపత్రినుంచి విడుదలకాగానే సంతోషంతో ముఖం విప్పారింది. జీవితానికి ఆధారం ఏర్పడిందని కళ్లు తెల్పుతున్నాయ్. ఆనందంతో రెండు మూడిళ్ళు కుంటుకుంటూ తిరగాడు. కాని ఫలితం శూన్యం. నిరాశలేదుగాని మారో నాల్గిళ్లు తిరగాలి కదా అనుకుంటూ ఆయాసంతో రొప్పుకుంటూ రెండు వీధులు చుట్టివచ్చాడు. ఫలితంగా కాళీగా వున్నజోలి నవ్వింది. కుంటికాలు ఎగతాళి చేసింది. చేతిలోని కర్ర వికటాట్టహాసం చేస్తూ నేలమీద పడింది. ఆధారంలేక ఆ పెద్దశరీరం నేల ఒరిగింది. ★